ఒపిఎస్ అమలు చేయాలని వినతి

రోషన్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - చింతలపూడి

సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని యుటిఎఫ్ మండలాధ్యక్షులు దామోదరరావు, మండల ట్రెజరర్ ప్రేమ్ కుమార్ కోరారు. ఈ మేరకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సొంగ రోషన్‌కుమార్‌కి గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

'గన్ని' గరంగరం..

ఉంగుటూరు టిక్కెట్ జనసేనకు కేటాయించినట్లు ప్రచారం

పొత్తులో భాగంగా జనసేన అభ్యర్థి ధర్మరాజుకు టిక్కెట్

పొత్తు సరే.. విజయావకాశాలు చూడరా అంటున్న గన్ని

నాలుగు మండలాల నేతలు, కార్యకర్తలతో అత్యవసర సమావేశం

వాడీవేడిగా ఉంగుటూరు నియోజకవర్గ రాజకీయం

భీమడోలులో టిడిపి కార్యకర్తలు, నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, భీమడోలు

టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు, ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గన్ని వీరాంజనేయులు టిడిపి అధిష్టానంపై గరంగరంగా ఉన్నారు. పొత్తులో భాగంగా ఉంగుటూరు టిక్కెట్ జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజుకు కేటాయించినట్లు దాదాపు స్పష్టత వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. టిక్కెట్ జనసేనకు కేటాయించినట్లు టిడిపి అధిష్టానం గన్నికి చెప్పినట్లు తెలిసింది. టిక్కెట్ తనకు కేటాయించకపోవడంపై గన్ని వీరాంజనేయులు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. పొత్తు సరే, విజయావకాశాలు చూడరా అంటూ నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తల వద్ద గన్ని వాపోయినట్లు తెలుస్తోంది. అత్యవసరంగా నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలతో భీమడోలులో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. పార్టీ అధిష్టానం తనకు అన్యాయం చేసిందని తీవ్ర ఆవేదనకు గురైనట్లు తెలుస్తోంది. న్యాయం కోసం ఏం చేయాలో తనకు తెలుసు అని వ్యాఖ్యానించినట్లు సమాచారం. కార్యకర్తలు, నాయకుల నిర్ణయం మేరకు ముందుకు సాగుతానని అన్నట్లు తెలిసింది. ఎన్నికల్లో అస్త్ర సన్యాసం చేస్తామంటూ పలువురు నాయకులు సైతం పేర్కొన్నట్లు చెబుతున్నారు. దీంతో ఉంగుటూరు నియోజకవర్గ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. 2014 ఎన్నికల్లో ఉంగుటూరు నియోజకవర్గం నుంచి గన్ని వీరాంజనేయులు ఎంఎల్‌ఎగా గెలిచారు. 2019 ఎన్నికల్లో ఓటమి చెందారు. ఆ తర్వాత టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గ టిక్కెట్ తనకే అంటూ గడిచిన ఐదేళ్లుగా పని చేస్తున్నారు. 2019 ఎన్నికల తర్వాత జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా క్షత్రియ సామాజిక తరగతికి చెందిన పత్సమట్ల ధర్మరాజును నియమించింది. అప్పటి నుంచి ఆయన అనేక కార్యక్రమాలు చేస్తూ తమ పార్టీని మరింతగా జనంలోకి తీసుకువెళ్లారు. టిడిపి, జనసేన పొత్తు ఖరారు కావడంతో ఉంగుటూరు టిక్కెట్ గన్నికి ఇస్తారా లేక ధర్మరాజుకు ఇస్తారా అనే సందేహాలు అలముకున్నాయి. తొలి జాబితాలో ఉంగుటూరు స్థానంపై ఇరుపార్టీలూ ఎటువంటి ప్రకటనా చేయలేదు. దీంతో ఇరుపార్టీల నాయకుల్లో మరింత టెన్షన్ నెలకొంది. ఉంగుటూరు టిక్కెట్‌పై ఇప్పటికీ అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. అయితే జనసేనకు సీటు కేటాయించినట్లు అధిష్టానం నుంచి నాయకులకు సమాచారం అందినట్లు తెలిసింది. దీంతో టిడిపి టిక్కెట్ ఆశించిన గన్ని వీరాంజనేయులు అధిష్టానం తీరుపై మండిపడుతున్నారు. ముందుముందు పరిస్థితి ఏ విధంగా ఉంటుందో వేచిచూడాలి.

ఉంగుటూరు సీటుపై పునరాలోచించాలి

టిడిపి నేత గన్ని వీరాంజనేయులు

ఉంగుటూరు సీటు జనసేనకు కేటాయించడంపై టిడిపి, జనసేన అధినేతలు పునరాలోచన చేయాలి. ఈ సీటు జనసేనకు కేటాయించారని తెలియగానే టిడిపి నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మెసేజీ పెడితే మూడు గంటలకు వేలాది మంది ఇక్కడకు చేరుకున్నారు. కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తాను. రాజీనామాలు, ఆందోళనలు వంటివి వద్దని అందరికీ సర్ది చెప్పాను. పొత్తుతో పాటు, గెలిచే అభ్యర్థుల ఎంపిక కూడా ముఖ్యం. జిల్లా అధ్యక్షునిగా నా అభిప్రాయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తాను. అధినాయకులు సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నాను.

ఏలూరులో ఎన్నికల గిఫ్ట్‌లు..!

- షెడ్యూల్ రాకముందే అధికార పార్టీ పంపిణీ
- మెప్మా ఆర్‌పిలకు సెల్‌ఫోన్లు అందజేత పూర్తి
- ఓటర్లతో వైసిపికి ఓటు వేయించాలని దిశానిర్దేశం
- వాలంటీర్లకు ఫోన్ల పంపిణీకి రంగం సిద్ధమైనట్లు సమాచారం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసిపి అభ్యర్థులు అనేక అడ్డదారులు తొక్కుతున్నారు. ఇప్పటికే ఆచంట, పాలకొల్లు వంటి నియోజకవర్గాల్లో డ్వాక్రా మహిళలకు చీరలు పంపిణీ చేయగా, ఏలూరు నియోజకవర్గంలో అంతకు మించి అన్నట్లు ఇక్కడి నాయకులు ముందుకు సాగుతున్నారు. డ్వాక్వా గ్రూపుల నిర్వహణలో కీలకంగా వ్యవహరించే నగరంలోని మెప్మా ఆర్‌పిలకు (రిసోర్స్ పర్సన్లు) సెల్‌ఫోన్లు పంపిణీ పూర్తయ్యింది. ఏలూరు నియోజకవర్గ పరిధిలో దాదాపు 150 మంది ఆర్‌పిలు ఉన్నారు. వీరందరికీ సుమారు రూ.పది వేలు ఖరీదు చేసే సెల్‌ఫోన్లు బహుమతులుగా అధికార పార్టీ నేతలు అందించినట్లు తెలిసింది. బుధవారం సెల్‌ఫోన్లు అందించిన నాయకులు గురువారం శనివారపుపేటలోని ఓ కల్యాణ మండపంలో ఆర్‌పిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఓటర్లు వైసిపికి ఓటు వేసేలా పని చేయాలని దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. ముఖ్యంగా డ్వాక్రా మహిళల ఓటర్లపై వైసిపి దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఆర్‌పిలకు సెల్‌ఫోన్లు పంపిణీ చేసిన విషయం ఏలూరు నగరంలో హాట్‌టాపిక్‌గా మారింది. ఏలూరు నగరంలో 72 వరకూ వార్డు సచివాలయాలు ఉండగా వీటి పరిధిలో దాదాపు 1400 మంది వరకూ వాలంటీర్లు పని చేస్తున్నారు. వాలంటీర్లకు సైతం సెల్‌ఫోన్లు అందించాలని వైసిపి నాయకులు ఆలోచన చేసినట్లు తెలిసింది. శుక్రవారం నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. జనాలతో సంబంధం ఉన్న ఉద్యోగులను ఎంపిక చేసుకుని వారికి ఎన్నికల బహుమతులు అందించి ఓటర్లను ప్రలోభపెట్టి గెలుపొందాలని అధికార పార్టీ నాయకులు ప్రణాళికలు రచించినట్లు తెలుస్తోంది. ఎన్నికల షెడ్యూల్ కూడా రాకముందే పెద్దఎత్తున ఎన్నికల తాయిలాలు అందిస్తున్న తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. దీంతో ఎన్నికల తరుణంలో పెద్దఎత్తున డబ్బు కుమ్మరించే పరిస్థితి ఉందని ప్రచారం సాగుతోంది. అధికార పార్టీ ఆర్‌పిలకు సెల్‌ఫోన్లు పంపిణీ చేయడంతో ప్రతిపక్ష టిడిపి నాయకులు ఏవిధంగా ముందుకు సాగుతారోననే చర్చ నడుస్తోంది.

14న రైతుల చలో ఢిల్లీ

జిల్లావ్యాప్తంగా నిరసనలు

వ్యవసాయ రంగాన్ని నాశనం చేస్తున్న మోడీని గద్దెదించాలి

సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశంలో నేతలు

అభివాదం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) జిల్లా సమావేశంలో వివిధ రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అన్నే భవనంలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) జిల్లా సమావేశం జరిగింది. సమావేశంలో ఎపి రైతుసంఘం (అన్నే భవనం) జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎపి రైతుసంఘం (స్ఫూర్తి భవనం) జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాథరావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసడాంగే, ఎపి కౌలురైతుల సంఘం (స్ఫూర్తి భవనం) దొంతా కృష్ణ, ఎపి కౌలురైతుల సంఘం (అన్నే భవనం) జిల్లా కన్వీనర్ కె.అప్పారావు మాట్లాడారు. బిజెపి ప్రభుత్వ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 14న రైతుల చలో ఢిల్లీ- అదే రోజు జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలకు ఎస్‌కెఎం పిలుపునిచ్చిందన్నారు. ఆ రోజు జిల్లా కలెక్టరేట్, అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. దీనిపై ఈ నెల 9 నుండి 12వ తేదీ వరకు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఆయా సంఘాల జిల్లా నేతలు నిమ్మగడ్డ నర్సింహా, సాలి రాజశేఖర్, వి.సాయిబాబా, వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, గంటా పాపారావు, గుండపనేని సురేష్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా పాటించాలి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

రానున్న సాధారణ ఎన్నికల్లో స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లూ చేస్తున్నట్లు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల ప్రక్రియ, ఎంసిసి, నామినేషన్ విధానం, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ, ఎంసిఎంసి తదితర అంశాలపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో నేతల రమేష్ బాబు (బిఎస్‌పి), ఎన్.నారాయణరావు (ఆమ్‌ఆద్మీ), శ్రీధర్ (బిజెపి), పి.ఆదిశేషు (సిపిఎం), ఎస్.అచ్యుతబాబు (టిడిపి), డి.సూర్యం (వైసిపి), డిఆర్‌ఒ డి.పుష్పమణి, కలెక్టరేట్ ఎఒ కె.కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీచేసే ఆయా అభ్యర్థులు తమ వద్ద ఉన్న కుల ధ్రువీకరణ పత్రాలను సమర్పించొచ్చన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఏరూపంలో కూడా ఎక్కడా వాలంటీర్లను వినియోగించకూడదని, ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. నామినేషన్ సమయంలో ప్రతి అంశాన్నీ క్షుణంగా పరిశీలించాలే తప్ప సరైన కారణం లేకుండా తిరస్కరించకూడదన్నారు. నామినేషన్ వేసిన రోజునే పరిశీలించి ఏమైనా లోపాలుంటే సరిచేయించాలన్నారు. మాక్‌పోల్ విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని, మాక్‌పోల్ పూర్తయిన వెంటనే రిజెక్ట్ బటన్ నొక్కి క్లియర్ చేయాలన్నారు. ఒకే అభ్యర్థి రెండు నియోజకవర్గాలకు మించి పోటీ చేసేందుకు ఆస్కారం లేదన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన రోజు నుంచి ప్రవర్తనా నియమావళి అమల్లోకి వస్తుందన్నారు. హోమ్ ఓటింగ్‌కు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, కేవలం మంచం నుండి కదల్లేని స్థితిలో ఉన్నవారు తప్ప ఎక్కువగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటుహక్కు వినియోగించుకోవడానికే ప్రాధాన్యతనిచ్చేలా చూడాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి మాట్లాడుతూ జిల్లాలో 1743 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో 21 చోట్ల లొకేషన్ మార్పు, 186 చోట్ల పేరు మార్పులకు ప్రతిపాదనలు ఉన్నాయని, వాటిని సమావేశం ఆమోదానికి సమర్పించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రెయినింగ్ ఎం.చక్రపాణి పలు అంశాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు పట్టిసీమ ముస్తాబు

ప్రజాశక్తి - పోలవరం

ఈ నెల 8, 9 తేదీల్లో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు పట్టిసీమ ముస్తాబైంది. భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం నుంచి ఫెర్రీరేవు వరకు కన్నులపండుగగా ముస్తాబైంది. మహాశివరాత్రి ఉత్సవ కమిటీ ఛైర్మన్ జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ అద్దయ్య, డిఎస్‌పి సురేష్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఇతర శాఖల అధికారుల సమన్వయంతో ఉత్సవ ఏర్పాట్లు పటిష్టంగా నిర్వహించారు. జంగారెడ్డిగూడెం నుంచి పట్టిసీమ వచ్చే భక్తుల కోసం కన్నాపురం అడ్డరోడ్డు వద్ద ఆర్‌టిసి కంట్రోల్ రూం, మైక్ ఎనౌన్సింగ్ కౌంటర్, కొవ్వూరు వైపు నుంచి వచ్చే బస్సుల కోసం పట్టిసీమ ఫెర్రీ రేవు వద్ద ఆర్‌టిసి కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. కొవ్వూరు వైపు నుండి పట్టిసీమ చేరుకునే బస్సులు పట్టిసీమ ఫెర్రీ రేవు వద్ద నిలిపి అక్కడి నుండి భక్తులను కన్నాపురం అడ్డరోడ్డుకు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫెర్రీ రేవు ద్వారా పంపే విధంగా ఏర్పాట్లు చేశారు. జంగారెడ్డిగూడెం నుండి వచ్చే బస్సులను కన్నాపురం అడ్డరోడ్డు వద్ద నిలిపి భక్తులను పంపడానికి ఏర్పాట్లు చేశారు. టిక్కెట్ కౌంటర్ల వద్ద రద్దీ లేకుండా క్యూలైన్లు, పోలీస్ బందోబస్తు, ఒక పోలీస్ కంట్రోల్ రూం, ప్రథమ చికిత్స కేంద్రం, ఫైర్ క్యాంపు, రెవెన్యూ క్యాంపు, ఇతర శాఖల అధికారుల కౌంటర్లు, వాటర్ ప్యాకెట్లు ఏర్పాట్లు చేశారు. నదిపై భక్తులు కాలినడకన వెళ్లే పంటుల వంతెనపై ఎలాంటి రద్దీ, రాకపోకలకు అంతరాయం, ప్రమాదాలకు తావు లేకుండా అడుగడుగునా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గత ఈతగాళ్లను ఫైర్, ఎపి టూరిజం, మత్స్యశాఖ, స్పీడ్ బోట్లలో అందుబాటులో ఉంచారు. మహిళలు బట్టలు మార్చుకునే తాత్కాలిక మరుగుదొడ్లు, ఇసుక తెన్నెల్లో భక్తులు సేద తీరడానికి చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఇసుక తెన్నెల్లో నడక సౌకర్యవంతంగా ఉండేందుకు వీలుగా సివిల్ సప్లయిస్ శాఖ ఆధ్వర్యంలో గోనె సంచుల్లో ఇసుక నింపి కాలిబాట ఏర్పాటు చేశారు.

తొలిరోజే అపశృతి

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంది. విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టిసీమ గ్రామానికి చెందిన పెంటపాటి హర్షకుమార్ (22) పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా విద్యుత్ లైన్ లైటింగ్ పనుల్లో భాగంగా ఏటిగట్టుపై విద్యుత్ లైన్లకు పైనుంచి వెళ్తున్న 11 కెవి వైర్లకు కనెక్షన్ ఇస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురవ్వడంతో తీవ్ర గాయాలపాలైన అతడిని పోలీస్ వాహనంలో పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే హర్షకుమార్ మృతి చెందినట్లుగా ధ్రువీకరించారు. మృతుడు హర్షకుమార్ అగ్రికల్చరల్ డిపార్ట్‌మెంట్‌లో ప్రయివేట్ ఉద్యోగి (డ్రోన్ ఆపరేటర్)గా పని చేస్తున్నాడు. సెలవుల కారణంగా ఎలక్ట్రికల్ పనికి వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుని బంధువులు సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆందోళనకు దిగారు.

అన్నింటా.. ఆమె..

నేడు మహిళా దినోత్సవం సందర్భంగా ప్రముఖుల మనోగతం

భారతీయ మహిళ తల్లిగా, భార్యగా, కోడలిగా ఇలా అనేక రూపాల్లో తన బాధ్యతలను నిర్వర్తిస్తూ విద్య, వృత్తి, ఉద్యోగాల్లో రాణిస్తోంది. పురుషులకు ఏమాత్రం తీసిపోకుండా అభివృద్ధి పథాన దూసుకెళ్తోంది. అయితే మహిళలపై అఘాయిత్యాలు, వేధింపులు ఎక్కువవుతున్నాయి. భద్రత లేదు. ఎన్ని చట్టాలు వచ్చినా పూర్తిస్థాయిలో న్యాయం జరగడం లేదు. ప్రభుత్వం చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. మహిళలకు విద్య, ఉద్యోగాల్లో మరింత స్వేచ్ఛ ఇవ్వాలి. మహిళా దినోత్సవం సందర్భంగా పలువురి ప్రముఖ మహిళల అభిప్రాయాలు..

బాధ్యత అందరిదీ.. ★ ★ ★

ఘంటా పద్మశ్రీ ప్రసాద్, జెడ్‌పి ఛైర్‌పర్సన్, ఏలూరు

మహిళలపై అత్యాచార సంస్కృతి పెచ్చుమీరడం తీవ్ర ఆందోళన కల్గిస్తోంది. సమాజ నిర్మాణంలో సగభాగమైన స్త్రీ సమానత్వమే మన ప్రగతికి మూలం. విద్య, వైద్యం, వ్యాపారం, రాజకీయాలు, క్రీడలు, బ్యాంకింగ్, అంతరిక్షం, టెక్నాలజీ వంటి పలు రంగాల్లో మహిళలు రాణిస్తూ మహిళా సాధికారత సాధన దిశగా అడుగులు వేస్తున్నారు. తాము ఇంటికే పరిమితం కాదంటూ పురుషులకు దీటుగా విజయాలు సాధిస్తున్నారు. డిజిటల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఫర్ జెండర్ ఈక్వాలిటీ నినాదంతో మన దేశంలో మార్చి 1 నుంచి 8వ తేదీ వరకు వారోత్సవాలు జరుగుతున్నాయి. మహిళా సాధికారత, లింగ సమానత్వంలో సాధించిన విజయాల కోసం పోరాడిన నారీ మణులకు నారీశక్తి పురస్కారాలు అందజేస్తారు. ఆ పురస్కారాలే భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు చేసేందుకు మహిళా శక్తికి ఆదర్శంగా నిలుస్తాయి. ఇంట్లోని ఆడవారిని గమనించి, గుర్తించి, ఆదరించి, గౌరవించడం తెలిస్తే బయట కూడా అదే విధమైన ప్రవర్తన ఉంటుంది. బాధ్యతల నుంచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, అధికార, అనధికారులు ఎవరూ తప్పించుకోలేరు. స్త్రీ పట్ల ఏదైనా పొరపాటు జరిగిందంటే స్పందన అత్యంత తీవ్రంగా ఉండాలిల్సిందే. ఇది అందరి బాధ్యత. సమాజం నుంచి ప్రతి మహిళకూ అందాల్సిన సాయం అదే. నాకు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా అవకాశం వస్తుందని అనుకోలేదు. నాకు నా భర్త ప్రసాద్‌రావు, సిఎం జగన్, దెందులూరు ఎంఎల్‌ఎ అబ్బాయిచౌదరి ప్రోత్సాహం ఎనలేనిది. అందరికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

రాజకీయాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యతివ్వాలి

బర్రి శ్రీ వెంకటరమణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్, నరసాపురం

నరసాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఉన్న నాతోపాటు, 31 మంది కౌన్సిలర్లలో 18 మంది మహిళలే ఉన్నారు. మహిళలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. రానున్న ఎన్నికల్లో ఎంపీ, ఎంఎల్‌ఎ టిక్కెట్లలో అన్ని పార్టీలూ ప్రాధాన్యతివ్వాలి. విద్యార్థులు మంచి భవిష్యత్తు ఉంది. విద్యార్థులు ప్రభుత్వం ఉచిత ట్యాబ్‌లు, విద్యాదీవెన పథకం ఉపయోగించుకుని చదువుకోవాలి. తోడైతే మహిళా సాధికారత పూర్తిస్థాయిలో సాధ్యమవుతుంది. ఆ దేశం ఉన్నత స్థాయికి ఎదుగుతుంది. నేను జిల్లా అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నా నాకు నా కుటుంబ సభ్యుల సహకారం ఎల్లప్పుడూ ఉంటోంది. మహిళా సాధికారత సాధనకు కుటుంబాల బలం కూడా మహిళలకు కీలకం.

ఎండమావిలా సమానత్వం.. ★ ★ ★

డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు

భారతీయ మహిళ ఒక తల్లిగా, భార్యగా, కోడలిగా, సోదరిగా, ఇలా ఎన్నో రూపాల్లో తన బాధ్యతలను నిర్వర్తిస్తోంది. అయినా సమానత్వం అనేది ఎండమావిలా కన్పిస్తోంది. పూర్వంతో పోల్చితే మహిళను చూసే విధానంలో చాలా మార్పు వచ్చింది. అయితే సమాజం ఇంకా మారాల్సిన అవసరం ఉంది. స్త్రీ అంగడి వస్తువు కాదు అని ప్రతి ఒక్కరూ గుర్తించిన రోజున సమాజం మరింత ముందుకెళ్లడానికి అవకాశం ఉంటుంది.

తగ్గిన ఉపాధి, వేతనాలు.. ★ ★ ★

పొగాకు పూర్ణ, ఐద్వా పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి

మహిళలకు ఉపాధి, సాధికారత, అభివృద్ధి మనదేశంలో క్రమంగా తగ్గుతోంది. 2018 నాటికి 21.9 శాతం మహిళలు భద్రత కలిగిన ఉపాధిలో ఉన్నారు. 2023 నాటికి ఇది 15.9 శాతానికి పడిపోయింది. అసంఘటిత రంగంలో పని చేసే మహిళలు గణనీయంగా పెరుగుతున్నారు. భద్రత లేదు. నిలకడ లేని పనులు చేయాల్సి వస్తోంది. కుటుంబాల్లో ఆర్థిక సమస్యలు పెరగడంతో అనివార్యంగా మహిళలు ఏదోక పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. భద్రత లేని ఉపాధి, తక్కువ వేతనాల వల్ల మహిళా సాధికారత కాగితాలకే పరిమితమైంది. లక్షలాది మంది మహిళలు ఉత్పత్తిలో భాగమవుతున్నారు. మహిళల పాత్ర ఉత్తేజకరంగా మారాలి. రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం కావాలి. అప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుంది. మహిళలు మరింత శక్తివంతులుగా తయారవుతారు.

చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరాలి.. ★ ★ ★

సి.నీరజ, బిజిబిఎస్ మహిళా కళాశాల ప్రిన్సిపల్, నరసాపురం

మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో పోటీ పడుతున్నారు. అన్ని రంగాల్లో మహిళలు స్వేచ్ఛ, సమానత్వం పొందడానికి చదువు కావాలి. సమానత్వానికి చదువే కీలకం. బాలికలు తప్పనిసరిగా విద్య అభ్యసించాలి. అదే వారిని ఉన్నత శిఖరాలు అధిరోహించేలా ధైర్యంగా ముందుకు నడిపిస్తుంది. మహిళలు అందరూ బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలి. ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు.

మహిళాభివృద్ధే..దేశాభివృద్ధి.. ★ ★ ★

ఎస్.శాంతకుమారి, జిల్లా ఉప రవాణా కమిషనర్, ఏలూరు

అందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. ప్రపంచంలో అతి ఎక్కువ సర్వేలు చెబుతున్నదేమిటంటే పురుషులతో సమానంగా మహిళలూ ఎదిగితేనే ఆ దేశం పూర్తిగా అభివృద్ధి చెందుతుంది. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించినప్పుడే ఇది సాధ్యం. దీనికిగాను మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం పొందాలి. దాంతోపాటు ముందుగా తమ ఇళ్లలో పిల్లలను విద్యావంతులుగా చేయాలంటే వారు ముందుగా చదువుకుని ఉండాలి. అందుకే మహిళలు విద్యావంతులు కావడం ఎంతో అవసరం. దీనికి ఆర్థిక స్వాతంత్ర్యం

మరింత చేయూత అవసరం.. ★ ★ ★

షేక్ నూర్జహాన్ పెదబాబు, ఏలూరు నగర మేయర్

ఏలూరు నగరానికి రెండుసార్లు మేయర్‌గా పని చేయడం గొప్పగా భావిస్తున్నాను. మహిళలు ఎంతో గొప్పవారు. సహనంలోను, తెలివితేటల్లోనూ, అర్థం చేసుకోవడంలోనూ, క్రమశిక్షణలోనూ ఎంతో గొప్పగా ఉంటారు. కెప్టెన్ లక్ష్మీ సెహెగల్‌తో వనితల జాగృతి మొదలైంది. గత పాతికేళ్లను తరచిచూస్తే ఏటా ఒక ప్రచారాంశాన్ని ఐక్య రాజ్యసమితి ప్రకటిస్తూ వస్తోంది. ప్రస్తుత అంశం - లింగ సమానత్వం. పాశ్చాత్య వైద్యంలో సుశిక్షణ అందుకున్న తొలి భారతీయ వనితారత్నం ఆనందీబాయి అమెరికాకు మొదటగా ప్రయాణం చేసిన మహిళామణి. మొట్టమొదటి ఆటోరిక్షా సారథిగా పేరొందిన మరొక భారతీయురాలు షీలా. అంగవైకల్యం ఉన్నప్పటికీ ఆత్మవిశ్వాసంతో ప్రథమంగా అత్యున్నత ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన పర్వతారోహకురాలు అరుణిమ. మోడలింగ్ రంగానికే తలమానికంగా రీటా, స్విమ్మర్‌గా ఆర్తి, క్రికెట్‌లో మిథాలీరాజ్, వ్యోమగామి కల్పనా చావ్లా, పోలీసు అధికారి కిరణ్‌బేడీ స్ఫూర్తి నేపథ్యం మహిళా దినోత్సవానికి మరింత శోభనిచ్చింది. నా భర్త పెదబాబు ప్రోత్సాహం అద్భుతం. అలాంటి ప్రోత్సాహం అందరికీ లభించాలి. అప్పుడే మహిళలు రాణిస్తారు.

సోషల్ మీడియాకు ఆకర్షితులు కారాదు.. ★ ★ ★

మంగాదేవి, టౌన్ సిఐ, పాలకొల్లు

గతంలోకన్నా మహిళా ఉద్యోగుల సంఖ్య అన్ని రంగాల్లో పెరుగుతోంది. ఇంకా సగం జనాభాకు తగ్గట్టు ఎటువంటి రిజర్వేషన్ లేకుండానే మహిళా ఉద్యోగుల సంఖ్య పెరగాల్సి ఉంది. మహిళలు ఆర్థికంగా, విద్యాపరంగా సాంఘికంగా అభివృద్ధి చెందితే సమాజం కూడా అభివృద్ధి చెందినట్లు. యువత సోషల్ మీడియాకు ఆకర్షితులు కాకుండా తమ జీవిత గమ్యాన్ని నిర్దేశించుకోవాలి.

మహిళలకు మరింత స్వేచ్ఛ ఇవ్వాలి.. ★ ★ ★

డాక్టర్ శోభారాణి, ప్రిన్సిపల్, డిఎన్‌ఆర్ మహిళా డిగ్రీ కళాశాల, పాలకొల్లు

మహిళలకు విద్య, ఉద్యోగాల్లో మరింత స్వేచ్ఛ ఇవ్వాలి. ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆవశ్యకత ఎంతైనా ఉంది. మహిళలు విద్యావంతులై ఆర్థికంగా ముందంజలో ఉంటే సమాజం కూడా ముందంజలో ఉంటుంది. కుటుంబంలో మహిళలు విద్యావంతులు కావడానికి మరింత ప్రోత్సాహం అవసరం. మహిళలు ఉన్నత విద్యావంతులు కావడానికి కృషి, పట్టుదల అవసరం. మహిళల రక్షణకు మరిన్ని చట్టాలు రావాలి. అప్పుడే మహిళలు మరింత స్వేచ్ఛగా వృత్తి, ఉద్యోగాల్లో రాణించగలుగుతారు.

మహిళలు వివాహం తర్వాతా విద్యాభ్యాసం కొనసాగించాలి.. ★ ★ ★

డాక్టర్ టి.రాజరాజేశ్వరి, ప్రిన్సిపల్, ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, పాలకొల్లు

ప్రస్తుతం విద్యావంతులైన మహిళలు అని రంగాల్లో దూసుకుపోతున్నారు. అయితే గ్రామీణ మహిళలు ఇంకా విద్యావంతులు కావాల్సి ఉంది. ప్రస్తుతం ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు వివాహమయ్యాక చదువుకు స్వస్తి చెబుతున్నారు. అలా కాకుండా వివాహమైనా విద్యాభ్యాసం సాగించి ఇటు ఉద్యోగం, అటు కుటుంబాన్ని నడపడం అలవర్చుకోవాలి.

చేయూత కింద రూ.215.39 కోట్లు జమ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో వైఎస్ఆర్ చేయూత పథకం నాల్గో విడత సాయం కింద రూ.215.39 కోట్లు, 1,14,874 మంది అర్హులైన మహిళల బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం జమ చేసిందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌తోపాటు డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, మెప్మా పీడీ ఇమ్మానుయేల్, పశుసంవర్ధకశాఖ జెడి డాక్టర్ జి.నెహ్రూబాబు, పలువురు చేయూత లబ్ధిదారులతో కలిసి అనకాపల్లి జిల్లా నుంచి సిఎం జగన్ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం ఏలూరు జిల్లాకు సంబంధించిన 4వ విడత వైఎస్ఆర్ చేయూత పథకం కింద 1,14,874 మంది బ్యాంకు ఖాతాలకు రూ.215.39 కోట్ల నమూనా చెక్కును కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని కుటుంబ జీవనోపాధిని మహిళలు మెరుగుపరుచుకోవాలన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష

ప్రజాశక్తి - కలిదిండి

ఇంటర్ ద్వితీయ సంవత్సర బోటని, మ్యాథ్స్-2ఎ, సివిక్స్ పరీక్షకు పది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ నంబూరి గోపాలకృష్ణంరాజు తెలిపారు. కలిదిండి, కోరుకొల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షకు 151 మందికి 141 మంది హాజరయ్యారని తెలిపారు.

ఉపాధి హామీ పనులు వంద రోజులు చేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

ఉపాధి హామీ పని రోజుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తప్పనిసరిగా ప్రతిరోజూ పని ప్రదేశానికి రావాలని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జి.భాగ్యశ్రీ చెప్పారు. మండలంలోని ముసునూరు, కోర్లగుంట, గుళ్లపూడి, వలసపల్లి, లోపూడి గ్రామాల్లో ఆమె గురువారం సుడిగాలి పర్యటన చేశారు. ఉపాధి హామీ పని రోజులు ప్రతికుటుంబం వంద రోజులు పూర్తి చేయాలన్నారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమెతో పాటు ఎపిఒ టి.రోజలీలా ఉన్నారు.

10న మన్యం బంద్ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - వేలేరుపాడు

ఆదివాసీలకు న్యాయం చేయాలని, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు జరుగుతున్న అన్యాయాన్ని ఖండిస్తూ ఈ నెల పదో తేదీన గిరిజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన మన్యం బంద్ విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో ఈ సంఘం ముఖ్య కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ నిరుద్యోగులకు వంద శాతం ఉద్యోగాలు, ఉపాధి కల్పన చూపించాలని డిమాండ్ చేస్తూ మన్యం బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

రోడ్డుపై నీరు నిల్వ లేకుండా చర్యలు

రూ.లక్ష విలువైన తూరలు అందించిన పార్థసారథి

ప్రజాశక్తి - ముసునూరు

లోపూడి గ్రామ పరిధిలో మురుగునీరు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా సమస్య పరిష్కారానికి టిడిపి, జనసేన నూజివీడు ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారథి సమకూర్చిన రూ.లక్ష విలువైన తొమ్మిది సిమెంట్ తూరలను టిడిపి నాయకులు గ్రామపెద్దలకు గురువారం అందించారు. కొన్నేళ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని పరింపూడి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎంపిపి గంజిమాల రామారావు, వైస్ ఎంపిపి ఎం.ఎలియ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ మంతెన సోమరాజు, మాజీ ఎంపిపి మట్ట సత్తిపండు, ఎంపిటిసి సభ్యులు గంటా శ్రీనుపాల్గొన్నారు.

ఫ్యాక్టరీలో మాక్‌డ్రిల్

ఉంగుటూరు: నారాయణపురంలో ప్రీమియ జాన్సన్ టైల్స్ ఫ్యాక్టరీలో అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు చేపట్టాల్సిన రక్షణ చర్యలపై గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్నిప్రమాదం, కెమికల్ గ్యాస్‌లీక్ తదితర విపత్తులు సంభవిస్తే ఎలా స్పందించాలో మాక్‌డ్రిల్ చేసి చూపించారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాస్, ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలీ, తహశీల్దార్ శివయ్య, పరిశ్రమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బంగారు దుకాణంలో కిలేడీలు

బంగారు ఉంగరం స్థానంలో రోల్డ్ గోల్డ్ ఉంగరం పెట్టి చోరీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

బంగారం దుకాణానికి వచ్చిన ఇద్దరు మహిళలు వచ్చారు. ఉంగరం కొనుగోలు చేస్తామని చెప్పి ఉంగరాలు చూస్తున్నారు. ఈ క్రమంలో బంగారం ఉంగరం స్థానంలో రోల్డ్ గోల్డ్ ఉంగరం పెట్టి అసలైన ఉంగరంతో అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటన జంగారెడ్డిగూడెం గురువారం చోటు చేసుకుంది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జంగారెడ్డిగూడెం మసీదు సెంటర్‌లో ఉన్న సాయిశ్రీ జ్యువెలర్స్‌కు గురువారం ఉదయం ఇద్దరు మహిళలు బంగారం కొనుగోలు చేసేందుకు వచ్చారు. షాపు సిబ్బంది ఉంగరాలు చూపించడంతో అదే వారిని చూస్తూ బంగారం ఉంగరం స్థానంలో రోల్డ్ గోల్డ్ పెట్టారు. వారు ఏమీ కొనుగోలు చేయకుండా బంగారు ఉంగరంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. వారి ప్రవర్తనపై అనుమానం వచ్చిన షాపు యజమాని కొంతసేపటికి పరిశీలించగా రోల్డ్ గోల్డ్ ఉంగరంగా నిర్ధారించారు. చోరీకి గురైన బంగారు ఉంగరం విలువ సుమారు రూ.22 వేలు ఉంటుందని తెలిపారు. వెంటనే జంగారెడ్డిగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సీసీ ఫుటేజ్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి పడి యువకుడికి గాయాలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

భవనంపై నుంచి జారి పడి యువకుడు గాయాలపాలైన ఘటన పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొండ శ్రీనివాసరావు గురువారం పట్టణంలో తాపీ పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ భవనంపై నుంచి జారి కింద పడడంతో గాయాలపాలయ్యాడు. శ్రీనివాసరావును అక్కడివారు నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

చింతలపూడి :అక్రమంగా తరలిస్తున్న 2,500 కిలోల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చింతలపూడి సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ జరిన తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం... విజిలెన్స్, రెవెన్యూ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు చింతలపూడి మండలం తిమ్మిరెడ్డిపల్లెం గ్రామానికి చెందిన కుప్పాల రాజు ఇంట్లో గురువారం తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో 2,500 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శంకుచక్రపురానికి చెందిన కటారి చిన్నరావుతో కలిసి కొనుగోలు చేసిన బియ్యం వేరేచోటికి మహేష్‌కు బియ్యం విక్రయిస్తున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వీధి కుక్కల దాడిలో ఏడుగురికి గాయాలు

నూజివీడు రూరల్ : పట్టణంలో గురువారం వీధి కుక్కల దాడిలో ఏడుగురు గాయాలపాలయ్యారు. కోటవారిపేటకు చెందిన కొమ్ము బాయమ్మ, కృష్ణ విలాస్‌కు చెందిన చదల తారక్ విద్యార్థి పొనుగంటి సాయిరాజ్, ఎంఆర్ అప్పారావు కాలనీకి చెందిన ఆర్ తంగాణ్ విద్యార్థిని తానేటి తేజస్వినితో పాటు మరో నలుగురు విద్యార్థులు వీధి కుక్కల దాడిలో గాయాలపాలయ్యారు. వీరందరూ నూజివీడు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందారు.

నాటుసారా స్వాధీనం

టి.నరసాపురం : నాటుసారా తయారు చేస్తున్న మహిళపై పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ రాజు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తిరుమలదేవిపేట పంచాయతీ మధ్యాహ్నపువారిగూడెంలో నాటుసారా తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ దాడిలో మహిళను పట్టుకుని ఆమె వద్ద నుంచి పది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సోషల్ మీడియాలో అభ్యంతరకర దృశ్యాలు నియంత్రించాలి

మహిళా దినోత్సవం సదస్సులో ఐద్వా, యుటిఎఫ్, సిఐటియు నేతలు

నూజివీడు : మాట్లాడుతున్న మహిళా నేతలు

ప్రజాశక్తి - నూజివీడు

స్థానిక విక్రమ్ కాలేజ్ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, యుటిఎఫ్, సిఐటియు ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మహిళా నాయకురాలు బత్తుల అనురాధ మాట్లాడుతూ సోషల్ మీడియాలో అభ్యంతరకర సన్నివేశాలు, దృశ్యాలు నియంత్రించి విధించే కార్యాచరణ రూపొందించుకోవాలని, తద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ప్రయివేట్ ఛానల్స్ నియంత్రించాలని చెప్పారు. వీటి విశృంఖలత వల్ల నేడు అత్యాచార నేరాలు పెరుగుతున్నాయన్నారు. ఈ ఏడాది మన మహిళా సంఘాల తీర్మానంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు నందూరి పద్మావతి, మద్దాలి లక్ష్మి, సిఐటియు నాయకులు ఎరుదేసి ఆదిలక్ష్మి, యుటిఎఫ్ నాయకులు బత్తుల అనురాధ, ఆయా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ :స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల మహిళా సాధికారత విభాగం, హేలాపురి లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యం దేశాభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కెబి.రావు, కళాశాల మహిళా సాధికారత విభాగం కో-ఆర్డినేటర్ డాక్టర్ సి.హెచ్.ఉదయలక్ష్మి, కళాశాల మహిళా అధ్యాపకులు టివిఎస్.పద్మావతి, డాక్టర్ పిఆర్.కావ్యశ్రీ, ఎస్.సుశ్మిత మాట్లాడారు. అనంతరం మహిళా అధ్యాపకులకు, విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కళాశాల మహిళా సిబ్బందిని సన్మానించారు.

టి.నరసాపురం : స్థానిక విజన్ యుపి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు, అమ్మకు వందనం కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం మండల వైద్యాధికారి కల్యాణికి ఘనంగా సన్మానించారు.

కామవరపుకోట :స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మేడవరపు విజయలక్ష్మి కేక్ కట్ చేసి మహిళలందరికీ అందించారు. మండలంలోని 54 మంది వివోఎలకు మెమెంటోలను అందించారు.

ముసునూరు : స్థానిక వెలుగు క్రాంతి కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపిపి కొండా దుర్గాభవానీ వెంకట్రావ్, గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడారు.

భీమడోలు : స్థానిక శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల యాజమాన్యం, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో పలువురు మహిళా ఉద్యోగ ప్రముఖులను సత్కరించారు. భీమడోలు సిహెచ్‌సి వైద్య పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీతతో పాటు ఇతర వైద్యులు శ్వేత, అశ్విని, ఏలూరు ప్రభుత్వాసుపత్రి కళాశాల బోధకులు లీలా కుమారిలను సత్కరించారు. కళాశాల ప్రధానాచార్యులు బొమ్ము రవికుమార్ అధ్యక్షత వహించగా ఎన్ఎస్ఎస్ విభాగం బాధ్యులు బి.శశికాంత్, ఎన్‌సిసి విభాగపు కళాశాల అధికారి లెఫ్టినెంట్ కె.శివశంకర్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని శ్రీహరిపురం ఎంపిపి పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కె.నాగమణి, లలితాదేవి, పి.లక్ష్మి, సిఐటియు మండలాధ్యక్షులు ఎస్.అరుణ, అంగన్వాడీ వర్కర్స్ మండల వైస్ ప్రెసిడెంట్ బి.పద్మ మండల కార్యదర్శి ఎన్.మణిలను సత్కరించారు. స్థానిక జెడ్‌పి హైస్కూల్ ఆవరణలో ఎంఆఇ కె.నరసింహకుమార్ ఆధ్వర్యంలో మహిళలకు పలు పోటీలు నిర్వహించారు.

సమస్యల వలయంలో వైఎస్ఆర్ కాలనీ

ప్రజాశక్తి - చింతలపూడి

వైఎస్ఆర్ కాలనీలో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయని టిడిపి నియోజకవర్గ అభ్యర్థి సొంగ రోషన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని పలు గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు తమ సమస్యలు తెలుపుతుంటే బాధ వేస్తుందన్నారు. గత ఐదేళ్లలో రోడ్లు, డ్రెయినేజీలు ప్రభుత్వం మర్చిపోయిందన్నారు. రోడ్డుపైకి వచ్చి సమస్య చెబుతున్నారంటే అధికార పార్టీ అభివృద్ధి ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో అర్థం చేసుకోవాలన్నారు. 2024లో టిడిపి ప్రభుత్వం వస్తుందని, ప్రజ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రోడ్లు, డ్రెయినేజీపై ప్రత్యేక దృష్టి పెడతానని చెప్పారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, స్థానిక ఎమ్మెల్యేని కలుపుకొని వెళ్లడం లేదని, ఇక ప్రజ సమస్యల గురించి ఏమి పట్టించుకుంటారని ఎద్దేవా చేశారు. అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగదరపు ముత్యాలరెడ్డి, పట్టణ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, ఐటిడిపి నియోజకవర్గ కన్వీనర్ బోడ అనీష్, తాటి అప్పారావు, రాజారత్నం పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కండి : సిపిఐ

ప్రజాశక్తి - వేలేరుపాడు

ఎన్నికల సమయం ఆసన్నమైందని, ప్రతి ఓటరు మంచి నాయకుడిని ఎన్నుకోవాలని సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య సూచించారు. వేలేరుపాడు సిపిఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన పదేళ్లుగా నిర్వాసితులు అనేక విధాలుగా సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ మునీర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కారం ధారయ్య, రామవరం సర్పంచి పిట్ట ప్రసాద్, జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి రమణ రాజు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

ప్రజాశక్తి - ఉంగుటూరు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిపేందుకు పోలీసు శాఖ సంసిద్ధంగా ఉందని నిడమర్రు సిఐ సుభాష్ అన్నారు. కైకరం, తల్లాపురంలో స్పెషల్ ఫోర్స్ పోలీసు కవాతులను గురువారం నిర్వహించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రధానంగా దృష్టి సారించామని తెలిపారు. చేబ్రోలు ఎస్ఐ మణికుమార్ పాల్గొన్నారు.

సెక్టోరియల్ అధికారులకు ఎన్నికల శిక్షణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై గురువారం ఎలక్షన్ సెక్టోరియల్ అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రయినీ డొక్కు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వరకు వేచి చూసే ధోరణి లేదన్నారు. నోటిఫికేషన్ నాటికి సర్వం సిద్ధం చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు.

రంగా విగ్రహ ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - కుక్కునూరు

స్థానిక మండల కేంద్రంలో కాపు సంఘం ఆధ్వర్యంలో కీర్తిశేషులు వంగవీటి రంగా విగ్రహ ఏర్పాటుకు స్థల ఏర్పాట్లలో భాగంగా జెండా ఆవిష్కరణతో గురువారం శ్రీకారం చుట్టి తదుపరి కార్యాచరణ కావాల్సిన వాటి గురించి చర్చించారు. ఈ సందర్భంగా కాపు సంఘం నాయకులు మాట్లాడుతూ రంగా ప్రతిభగా మండల కేంద్రంలో విగ్రహ ఏర్పాటుకు సిద్ధమవుతున్నామని చెప్పారు.

'వైసిపి హయాంలో ప్రతి ఇంటికీ లబ్ధి'

ప్రజాశక్తి - చింతలపూడి

అందరం కలిసికట్టుగా పని చేసి 2024లో వైసిపిని గెలిపించాలని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజు అన్నారు. మండలంలోని ఎర్రగుంటపల్లిలో వైసిపి కార్యకర్తలను, నాయకులను ఆయన గురువారం పరిచయం చేసుకున్నారు. అనంతరం పోలింగ్ బూత్ కన్వీనర్లతో బిపిఎన్ ఫంక్షన్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరాజు వైసిపి హయాంలో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందన్నారు. ప్రతిఒక్కరూ జగన్‌కు మద్దతుగా ఉండాలని కోరారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపుకోట నుంచి జీలకర్రగూడెం రహదారి నిర్మాణ పనులను మద్ది ఆంజనేయస్వామి ట్రస్ట్ ఛైర్మన్ కేసరి సరితవిజయభాస్కర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఆ పనులకు ఎంపీ కోటగిరి శ్రీధర్ గత నెలలో శంకుస్థాపన చేశారు. పనులను పరిశీలించిన విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ రహదారి నిర్మాణం తమ గ్రామస్తుల రెండు దశాబ్దాల కోరిక అని చెప్పారు. ప్రభుత్వం ఈ రోడ్డును నిర్మించడం ఎంతో సంతోషకరమన్నారు. గతంలో ఈ రోడ్డు లేక జలపాలగూడెం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. త్వరలోనే వారి గ్రామానికి రహదారి సమస్య తీరుతుందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

జంగారెడ్డిగూడెంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం సచివాలయం-10 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మున్సిపల్ మేనేజర్ రమణ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జంగారెడ్డిగూడెం మున్సిపల్ ఛైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి, వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, పట్టణ అధ్యక్షులు చిటికెల అచ్యుతరామయ్య హాజరయ్యారు.

సర్పంచి అత్త సక్కుబాయమ్మ మృతి

ముదినేపల్లి :మండలంలోని దేవపూడి సర్పంచి దాసరి కాశీఅన్నపూర్ణ అత్త దాసరి సక్కుబాయమ్మ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. సక్కుబాయమ్మ మృతదేహానికి ఎంఎల్ఎ తనయుడు దూలం అశోక్ కుమార్, టిడిపి నాయకుడు కొడాలి వినోద్ సందర్శించి నివాళులర్పించారు.

నేడు భారీ అన్నసమారాధన

చాట్రాయి :చాట్రాయిలో పురాతన శివాలయం శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయం ఎంతో ప్రసిద్ధి గాంచింది. చాట్రాయి గ్రామం పక్కనే చెరువు ఆనుకుని ఉన్న శివాలయం వందల సంవత్సరాల నుంచి చుట్టుపక్కల ప్రాంత ప్రజలకు ఆరాధనగా ఉంది. ఆరాధించిన వారి జ్ఞాపకార్థం పిండప్రదానాలకు ప్రత్యేక నిలయంగా మారింది. ఈ శుక్రవారం మహాశివరాత్రి పురస్కరించుకుని పది వేల మందికి పైగా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు గోళ్ల నారాయణరావు, గోళ్ల వేణేశ్వరరావు, గోళ్ల బద్రీనాథ్ తెలిపారు.

దగా డిఎస్‌సి వద్దు.. గిరిజన డిఎస్‌సి ముద్దు

ఐటిడిఎ వద్ద గిరిజన సంఘం ధర్నా
ప్రభుత్వం స్పందించకపోతే 10న బంద్

ధర్నా చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

దగా డిఎస్‌సి వద్దని, గిరిజన డిఎస్‌సి కావాలని కెఆర్.పురం ఐటిడిఎ వద్ద గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, ధర్ముల రమేష్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 6100 డిఎస్‌సి ఉపాధ్యాయుల పోస్టుల్లో 1025 పోస్టులు గిరిజన సంక్షేమ శాఖకు కేటాయిస్తే రాష్ట్రం మొత్తం ఐటిడిఎ పరిధిలో 517 నోటిఫై చేశారని, ఇందులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు 14 పోస్టులు మాత్రమే కేటాయించారని చెప్పారు. దీంతో ఏజెన్సీ ప్రాంత గిరిజన నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో స్థానిక గిరిజన ఉద్యోగుల స్థానంలో గిరిజనేతరులతో భర్తీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాతృభాష విద్యా వాలంటీర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కుంజ నవీన్ కుమార్, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోలోజు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల పదో తేదీన ఏజెన్సీ ప్రాంత బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు బొరగం భూచంద్రం, చంద్ర బుల్లెమ్మ, తమా బాలరాజు, పాపారావు పాల్గొన్నారు.

ఎస్‌సి హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

స్థానిక ఎస్‌సి బాలుర వసతిగృహంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎస్‌సి బాలుర వసతిగృహంలో ఎస్ఎఫ్ఐ బృందం ఈ నెల 6, 7 తేదీల్లో సర్వే చేసిందని చెప్పారు. వసతిగృహంలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ముఖ్యంగా ఎస్‌సి బాలుర వసతిగృహంలో సరైన సిబ్బంది ఉండడంలేదన్నారు. సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉందని, దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌సి హాస్టళ్లలో సిబ్బందిని భర్తీ చేయాలని, మెస్, కాస్మోటిక్స్ ఛార్జీలు పెంచాలని కోరారు.

విద్యాభివృద్ధికి జగన్ పెద్దపీట

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, అందుకే సిఎం జగన్ విద్యారంగం అభివృద్ధికి పెద్ద పీట వేశారని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. మండలంలో గురువారం పర్యటించిన ఆయన వైసిపి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తెల్లం రాజ్యలక్ష్మితో కలిసి పలు ప్రభుత్వ భవనాలు ప్రారంభించారు. మండలంలోని మక్కినవారిగూడెం, తిరుమలదేవిపేట గ్రామాల్లోని సొసైటీల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన మల్టీపర్పస్ గోడౌన్లు, కొల్లివారిగూడెం, నాయకులగూడెం, వల్లంపట్ల గ్రామాల్లో నాడు-నేడులో అభివృద్ధి చేసిన ప్రాథమిక పాఠశాలలను, టి.నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన మహిళా జూనియర్ కళాశాలను, అల్లంచర్ల రాజుపాలెంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ సెంటర్, వల్లంపట్ల గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు గుళ్ల ప్రసాదరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జెడ్‌పిటిసి సభ్యులు కొరిపల్లి జయలక్ష్మి, ఉంగుటూరు ఎంఇఒ శ్రీనివాసరావు హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జాతీయస్థాయి అండర్-16లో 80 మీటర్ల హర్డిల్స్‌లో రికార్డు క్రియేట్ చేసిన సాహిల్‌బాబును సన్మానించారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ వాటర్ వర్కర్స్‌తో ఆమె గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తిన నాగలక్ష్మి మాట్లాడుతూ రానున్న వేసవికాలంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పైపులైన్లు, మోటార్లు మరమ్మతులు రాకుండా చూసుకోవాలని, ఒకవేళ వచ్చినా వీలైనంత త్వరగా వాటికి మరమ్మతులు చేయాలని చెప్పారు. తాగునీటి సమస్య తలెత్తితే వాటర్ వర్క్స్ సెక్షన్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, 11వ వార్డు కౌన్సిలర్ ఉగ్రం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

O.S. No. 12/2021

Between:
Penumarthi Srinivas ...Plaintiff
AND
Pothula Ramya & Another ...Defendants

Defendant No-1:
Pothula Ramya, W/o. Desam Syam Sundar Reddy, Yarraguntapalli, Chinthalapudi Mandal.

Defendant No-2:
Desam Syam Sundar Reddy, Yarraguntapalli, Chinthalapudi Mandal.

పదరు పై నెంబరు గ్రంథమున శ్రీ కోర్టు వారు మీకు నోటీసు సమన్సు జారీ చేసియున్నప్పటికిని ఉద్దేశ్య పూర్వకముగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీరు ది. 25-03-2024 నం. తేదిన ఉదయం 10.30 గం॥కు మహారాజశ్రీ పై కోర్టు వారి ఎదుట హాజరు కావలయును. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

N.S.R.N.CHOWDARY
Advocate & Notary
కొవ్వూరు Kakinada
ది.20-2-2024 Cell: 9848222585

గ్రామపంచాయతీ కార్యాలయము, ఆగిరిపల్లి

టెండరు ప్రకటన

ఆర్.సి. నెం.44/బి 2024 తేది.07-03-2024

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, ఆగిరిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఈ క్రింది పేర్కొన్న పనులు రోజువారి పనుల నిమిత్తం అనుభవము గల ఏజెన్సీలు కాంట్రాక్టర్లకు నుండి ది. 16-03-2024కి తేది మధ్యాహ్నం గం 12.00 వరకు సీల్డు టెండర్లు ఆహ్వానించడమైనది. దాఖలైన టెండర్లను అదేరోజు మధ్యాహ్నం గం 12.30 నిఆకు అప్పటి వరకు వచ్చిన టెండరుదారుల సమక్షంలో పంచాయతీ కార్యదర్శి వారిచే తెరవబడును. పూర్తి వివరములకు పంచాయతీ కార్యాలయము నందు సంప్రదించగలరు.

నెం.	పనుల వివరములు	పనిచేయవలసిన కాలము	చెల్లించవలసిన ధరావతు
1	పారిశుధ్య పనులు చేయుటకు 15 మంది వ్యక్తులు	ది.01-04-2024 నుండి 31-03-2025 వరకు	రూ. 5,000/-లు
2	పైప్ లైన్ ఫిట్టర్ కమ్ మోటార్ ఆపరేటర్ 3 వ్యక్తులు	ది.01-04-2024 నుండి 31-03-2025 వరకు	రూ. 5,000/-లు
3	వీధి విద్యుద్దీపాల రిపేరులు 2 వ్యక్తులు	ది.01-04-2024 నుండి 31-03-2025 వరకు	రూ. 2,000/-లు

గమనిక: 1. అనుభవము గల్గి ప్రాధాన్యత ఇవ్వబడును. 2. నెలవారి చెల్లింపులు గ్రామపంచాయతీ సాధారణ నిధుల లభ్యతను అనుసరించి చెల్లించబడును. 3. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి ఒక్కొక్క పనికి రూ. 10,000/-లు మించకుండా రోజువారి దారుల పేరట టెండరు దాఖలు చేయవలెను. 4. ప్రాదేశిక ITI సర్టిఫికెట్ పొంది ఉండవలెను. OHSR క్లీనింగ్ మరియు పైపు లైన్లకు లీకేజీలు ఉంటే మరమ్మత్తులు చేయవలెను. ఎటువంటి కారణం చూపకుండా టెండర్లు తిరస్కరించబడును.

శ్రీమతి చవటపల్లి లక్ష్మి, సర్పంచ్ సం/- బి.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి
గ్రామపంచాయతీ, ఆగిరిపల్లి

గ్రామపంచాయతీ కార్యాలయము, అమ్మవారిగూడెం

టెండరు ప్రకటన

ఆర్.సి. నెం.14/బి 2024 తేది.07-03-2024

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, అమ్మవారిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఈ క్రింది పేర్కొన్న పనులు రోజువారి పనుల నిమిత్తం అనుభవము గల ఏజెన్సీలు కాంట్రాక్టర్ల నుండి 18-03-2024కి తేది మధ్యాహ్నం గం 12.00 వరకు సీల్డు టెండర్లు ఆహ్వానించడమైనది. దాఖలైన టెండర్లను అదేరోజు మధ్యాహ్నం గం 12.30 నిఆకు అప్పటి వరకు వచ్చిన టెండరుదారుల సమక్షంలో పంచాయతీ కార్యదర్శి వారిచే తెరవబడును. పూర్తి వివరములకు పంచాయతీ కార్యాలయము నందు సంప్రదించగలరు.

నెం.	పనుల వివరములు	పనిచేయవలసిన కాలము	చెల్లించవలసిన ధరావతు
1	పారిశుధ్య పనులు చేయుటకు 02 మంది వ్యక్తులు	ది.01-04-2024 నుండి 31-03-2025 వరకు	రూ. 1,000/-లు
2	పైప్ లైన్ ఫిట్టర్ కమ్ మోటార్ ఆపరేటర్ 01 వ్యక్తులు	ది.01-04-2024 నుండి 31-03-2025 వరకు	రూ. 500/-లు

గమనిక: 1. అనుభవము గల్గి ప్రాధాన్యత ఇవ్వబడును. 2. నెలవారి చెల్లింపులు గ్రామపంచాయతీ సాధారణ నిధుల లభ్యతను అనుసరించి చెల్లించబడును. 3. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి ఒక్కొక్క పనికి రూ. 10,000/-లు మించకుండా రోజువారి దారుల పేరట టెండరు దాఖలు చేయవలెను. 4. ప్రాదేశిక ITI సర్టిఫికెట్ పొంది ఉండవలెను. OHSR క్లీనింగ్ మరియు పైపు లైన్లకు లీకేజీలు ఉంటే మరమ్మత్తులు చేయవలెను. ఎటువంటి కారణం చూపకుండా టెండర్లు తిరస్కరించబడును.

శ్రీ జలపాత్ర కొండలరావు, సర్పంచ్ సం/- బి.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి
గ్రామపంచాయతీ, అమ్మవారిగూడెం

జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ

ఆర్.ఓ.సి. నెం.20/2023/ఇ1 తేది.07-03-2024

జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో ఈ దిగువ తెలిపిన పనులు చేపట్టుటకు ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండరులు పిలువబడుచున్నవి.

వ.నెం.	పని వివరము	పనుల సంఖ్య	ECV (రూ. లక్షలలో)
1.	జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో సాధారణ నిధుల నుండి మోటార్లు & మీటీరియలు సరఫరా	01	10.00

సంబంధిత వివరములు https://tender.apeprocurement.gov.in వెబ్ సైటు నందు ది. 08-03-2024వ తేదీ ఉదయం గం॥ 10.00ల నుండి చూడవచ్చును. ఇతర వివరములకు మున్సిపాలిటీ కార్యాలయము, ఇంజనీరింగ్ విభాగము నందు సంప్రదించగలరు.

సం/- కమిషనరు
జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ

CHANGE OF NAME

I, SONGA YESURATNAM, S/o YESEBU, Residence of D.No:3, Katrenipadu Village, Musunuru Mandal, Eluru District, do here by solemnly affirm and sincerely state on oath as follows:

I, here by declare that my daughter name is JASMINE SONGA is studied in your SEVENTH DAY ADVANTIST HIGHER SECONDRY SCHOOL, NUZVID, UNIQUE ID: 8279097. She is studing in I.C.S.E (Class X), No: 1244181/050 in 2024.

In that certificate my daughter's name was wrongly mentioned in MARY JASMINE SONGA instead of JASMINE SONGA. Hence, I request to the School Authorities to correcting the above mistake with correct my daughter Name JASMINE SONGA.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 39/2023

Plaintiff: Mullapudi Satya Surendra
Defendant: Vegi Vijaya Venkata Rama Jogi Surya Vara Prasad

To:
Vegi Vijaya Venkata Rama Jogi Surya Vara Prasad, S/o. Venugopala Krishna murthy, Lakshmi Nagar, H/o. Gunnampalli, Dwaraka Tirumala Mandalam, Bhimadole, J.C.J.

పై నెంబరు దావాలో ప్రతివాది ఎస్సార్డు దావా సమన్లు పంపినను దావా సంగతులు తెలిసియుండి సదరు సమన్లు తీసుకొనకుండా Evade చేయుచున్నందున Substituted Service ద్వారా అమలు జరుపుటకు ఉత్తర్వులు యిచ్చి ది. 14-03-2024కి వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు వాయిదా రోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనిచో మీ పరోక్షమున పై నెంబరు దావా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

KUSULURI SIVA RAMA KRISHNA
Advocate for Plaintiff
Tadepalligudem Tadepalligudem
Date: 07-03-2024 Cell: 9949076266

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. No. 932/2023 in O.S. No. 39/2023

Petitioner/ Plaintiff:
Mullapudi Satya Surendra

Respondent/ Defendant:
Vegi Vijaya Venkata Rama Jogi Surya Vara Prasad

To:
Vegi Vijaya Venkata Rama Jogi Surya Vara Prasad, S/o. Venugopala Krishna murthy, Lakshmi Nagar, H/o. Gunnampalli, Dwaraka Tirumala Mandalam, Bhimadole, J.C.J.

పై నెంబరు ఐఏ పిటిషనులో మీ ఆస్తి జప్తుకు పోకాజు నోటీసు పంపగా మీకు సదరు నోటీసు సంగతి తెలిసియుండి సదరు నోటీసు తీసుకొనకుండా Evade చేయుచున్నందున Substituted Service ద్వారా అమలు జరుపుటకు గాను ఆర్డరు చేసియున్నారు. కావున యీ పేపరు ప్రకటన తేది నుండి 48 గంటల లోపుగా మీరు దావా మొత్తంకు తగు సెక్యూరిటీ ఇవ్వవలెను. లేనిచో మీ తాలూకు ఈ దిగువ షెడ్యూలు ఆస్తి జప్తు చేయబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

SCHEDULE

Presently Eluru District, previously West Godavari District, Bhimadole Sub Registrar, Dwaraka Tirumala Mandalam, Gunnampalli Panchayati Village, Zeroyati Dry, R.S. No. 237/1A after sub division R.S. No. 237/1A-1 to an extent of Ac. 1-72 1/2 cents or 8349 sq.yards of land within the following boundaries.
EAST: Road and Sunkavalli Satyanarayana.
SOUTH: Land of Guttikonda Ramarao.
WEST: Land of Sunkavalli Harshita Satya Sri.
NORTH: Land of Madduluri Lakshmi Madhavi.

Within the above boundaries to an extent of Ac. 1-72 1/2 cents or 8349 sq.yards of land in that 1/4th undivided share of the defendant with all easement rights.
The Plaintiff's Value is at Rs. 30,00,000/-

KUSULURI SIVA RAMA KRISHNA
Advocate for Plaintiff
Tadepalligudem Tadepalligudem
Date: 07-03-2024 Cell: 9949076266